# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 28-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారికి తగిన సమాధానం లభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.**

**2.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.**

**3.** **మావోయిస్టులతో చర్చలు జరిపేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

**4.** **మత్స్యకారుల భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు**

**5.** **పని ప్రదేశాలలోని కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఈ రోజు ప్రపంచ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారికి తగిన సమాధానం లభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 121వ సంచికలో ఆయన నిన్న పలు అంశాలపై ప్రసంగించారు. కాశ్మీర్ లో ప్రజల ఆదాయం పెరిగిందని, యువతకు నూతన అవకాశాలు విస్తృతమవుతున్నాయని, ప్రజాస్వామ్యం పటిష్టం అవుతుందని అన్నారు. వీటిని అడ్డుకోవాలనే దురుద్దేశంతో ఉగ్రవాదులు ఈ చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధంలో 140కోట్ల ప్రజల ఐకమత్యమే ప్రధానమని, ఇదే భారత్ బలమని ప్రధానమంత్రి పేర్కొంటూ..

వాయిస్ ..31 సెకన్లు

కాగా మన్ కీ బాత్.. 121వ సంచికపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా

ఉండవల్లిలో నిర్వహించిన ఈ సమావేశంలో పర్యటనకు సంబంధించిన పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక, పార్కింగ్ సహా వివిధ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 2న అమరావతిలో వివిధ ప్రాజెక్టులను ప్రధానమంత్రితో శంకుస్థాపన చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. రాజధాని అమరావతిలో పనుల పునఃప్రారంభానికి సూచికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారని తెలిపారు.

----------------------------

మరోవైపు.. ప్రధానమంత్రి సభ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసంలో అధికారులు, మంత్రుల ఉన్నత స్థాయి కమిటీతో నిర్వహించిన సమావేశ వివరాలను పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాత్రికేయులకు వివరించారు.వచ్చే నెల 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యే సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా 11 మార్గాలను సిద్ధం చేశామని తెలిపారు సభకు చేరుకునేలా ప్రయాణానికి ఇబ్బంది లేకుండా రూట్‌మ్యాప్‌ను త్వరలో ప్రకటిస్తామన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..35 సెకన్లు

----------------------------

మావోయిస్టులతో చర్చలు జరిపేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో శాంతి చర్చల కమిటీ నాయకులు ముఖ్యమంత్రితో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. ఈ మేరకు శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రేవంత్‌రెడ్డి.. నక్సలిజం అంశాన్ని ప్రభుత్వం సామాజిక కోణంలోనే చూస్తుందన్నారు. ఈ అంశంపై సలహాలు, సూచనలు తీసుకొని, మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

----------------------------

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చెల్లించే భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. జీవనభృతి ఇచ్చి ఆదుకోవడమే కాకుండా వలసలు వెళ్తున్న మత్స్యకారులకు స్థానికంగానే తగిన ఉపాధి చూపించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని పవన్‌కల్యాణ్ వివరించారు. ఈ మేరకు గత రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

----------------------------

విశాఖపట్నం జిల్లా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవంలో సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. హోం మంత్రి, నిన్న స్వామివారిని దర్శించుకున్న అనంతరం అధికారులతో కలిసి చందనోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లు, క్యూ లైన్లను జిల్లా కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..34 సెకన్లు

---------------------------

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం, నాగిరెడ్డి గారిపల్లెలో 27.60 లక్షల రూపాయలతో నిర్మించిన మినీ గోకులాలను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి రైతుల కోసం ప్రతి గ్రామానికి మినీ గోకులాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పశువులకు ఎండ, వాన నుంచి రక్షణ కల్పించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పాడి రైతులందరూ ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

భారత రాష్ట్ర సమితి –బీఆర్ఎస్ పార్టీ 25వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిన్న సాయంత్రం రజతోత్సవ సభను నిర్వహించారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.అనంతరం ఈ సభలో బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైందని చెప్పారు. ప్రజా సమస్యలగురించి ప్రశ్నిస్తున్న వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆయన తెలుపుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

పని ప్రదేశాలలోని కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఈ రోజు ప్రపంచ భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ... ఐఎల్ పిలుపుమేరకు 2003 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 28వ తేదీన ఈ కార్యక్రమం జరుపుకుంటున్నారు. “ఆరోగ్యం, భద్రతలో విప్లవాత్మక మార్పులు : పనిలో కృత్రిమ మేధ –ఎఐ, డిజిటలైజేషన్ పాత్ర” అనే అంశంతో ఈ ఏడాది ప్రపంచ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కార్మికులు తాము పనిచేస్తున్న ప్రదేశాలలో వృత్తిపరమైన ప్రమాదాలు, నివారించే దిశగా అవగాహన కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల్లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఈ రోజు పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో వర్షంతోపాటు ఉరుములు,మెరుపులు, ఈదురుగాలులు, పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ప్రభుత్వ కార్యదర్శి ఏ.శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

======================